సాక్షి కామారెడ్డి

శనివారం । 6 । సెప్టెంబర్ । 2025



విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలి

విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో ఉద్యోగుల కృషి అభినందనీయమని ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి అన్నారు.

- 8లో ▸



నిందితులను పట్టుకోవాలి

బాన్సువాడ రూరల్: అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను పట్టుకోవాలని అంబేడ్కర్ సంఘం నేతలు డిమాండ్ చేశారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.7 /21.1

ఆకాశం మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ తీక్షణంగా ఉంటుంది. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఆల్ టైం రికార్డుకు బంగారం

- 10 గ్రాముల ధర రూ.లక్షా 10 వేలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: బంగారం ధరలు మరింతగా పెరిగి ఆల్‌టైం రికార్డుకు చేరింది. మార్కెట్‌లో శుక్రవారం 10 గ్రాముల ధర రూ.లక్షా 10 వేలు దాటింది. దీంతో బంగారం అంటేనే జనం బెంబేలెత్తిపోయే పరిస్థితి ఏర్పడింది. రూ.లక్షకు చేరినప్పటి నుంచి బంగారం కొనుగోళ్లు తగ్గాయి. ఇప్పుడు ఏకంగా రూ.లక్షా పది వేలు దాటడంతో కొనే పరిస్థితి లేదంటున్నారు. ఇదే సమయంలో అడ్డగోలుగా పెరుగుతున్న ధరలతో బంగారం ఆభరణాలు తయారు చేసి జీవనం సాగించే స్వర్ణకారులకు పని కరువవుతోంది.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు



మద్నూర్(జుక్కల్): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదలతో భారీగా పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. మండలంలోని గోజేగావ్ శివారులో దెబ్బతిన్న పంటలను, లెండి వాగును శుక్రవారం ఎమ్మెల్యే పరిశీలించారు. లెండి వాగు వరద నీరు, వర్షాల వల్ల పంట మొత్తం నీటిలో మునిగిపోయిందని రైతులు ఈ సందర్భంగా ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. వంద శాతం పంటలు దెబ్బతిన్నాయని రైతులు వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని శ్రీకుమార్ గణేశ్ మండలి వద్ద ఎమ్మెల్యే పూజలు చేశారు. నిర్వాహకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో భక్తులకు అన్నం వడ్డించారు.

సరిహద్దు చెక్‌పోస్ట్‌లో నిఘా పెంచండి

- జిల్లా ఇన్‌చార్జి ఎక్సైజ్ ఈఎస్ హన్మంత్‌రావ్



మద్నూర్(జుక్కల్): చెక్‌పోస్ట్‌లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది నామమాత్రంగా తనిఖీలు చేయకుండా పకడ్బందీగా విధులు నిర్వహించాలని, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం, మత్తు పదార్థాలు తరలకుండా నిఘా పెంచాలని జిల్లా ఇన్‌చార్జి ఎక్సైజ్ ఈఎస్ హన్మంత్‌రావ్ ఆదేశించారు. మండలంలోని సలాబత్‌పూర్ వద్ద గల అంతర్రాష్ట్ర ఎక్సైజ్ చెక్‌పోస్ట్ వద్ద మహారాష్ట్ర నుంచి వస్తున్న వాహనాలను నిలిపి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెక్‌పోస్ట్ వద్ద 24 గంటల పాటు తనిఖీలు చేపట్టాలని స్థానిక ఎక్సైజ్ అధికారులకు సూచించారు. అక్రమ మద్యంతో పాటు మత్తు పదార్థాలు తరలకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. సలాబత్‌పూర్ ఎక్సైజ్ సీఐ జావీద్ అలీ, సిబ్బంది ఉన్నారు.

మిలాద్ ఉన్ నబీ సందర్భంగా రక్తదానం



రక్తదాతలకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న నిర్వాహకులు

కామారెడ్డి అర్బన్: మిలాద్ ఉన్ నబీ సందర్భంగా శుక్రవారం కామారెడ్డి మర్కజీ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ మదీనా మసీదులో రక్తదాన శిబిరం నిర్వహించారు. వంద మంది ముస్లింలు రక్తదానం చేశారు. ఇందులో తలసేమియా వ్యాధితో బాధపడే చిన్నారులకు 60 యూనిట్లు, జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి 40 యూనిట్ల రక్తం ఇచ్చారని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు తెలిపారు. ఐదేళ్లుగా ప్రతియేడు మిలాద్ ఉన్ నబీ సందర్భంగా రక్తదానం చేయడం ఆనవాయితీగా పెట్టుకుని ఇప్పటికి 650 యూనిట్లు రక్తం ఇచ్చారన్నారు. దాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. రక్తదాతల సమూహం అధ్యక్షుడు జమీల్ హైమద్, ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, శ్రీనివాస్, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలో నిమజ్జనానికి తరలుతున్న యువజన సమాఖ్య మండలి భారీ వినాయకుడు

ప్రారంభమైన శోభాయాత్ర

నవరాత్రులు పూజలు అందుకున్న లంబోదరుడి నిమజ్జన శోభాయాత్ర శుక్రవారం రాత్రి ప్రారంభమైంది. ఈ సందర్భంగా గణేశ్ విగ్రహాల ఊరేగింపు నిర్వహించే వాహనాలను అందంగా అలంకరించారు. డప్పు చప్పుళ్లు, యువకులు, చిన్నారుల నృత్యాల మధ్య శోభాయాత్ర కోలాహలంగా సాగింది. రోడ్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. శోభాయాత్ర మార్గంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

- శోభాయాత్రను ప్రారంభించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్ర
- నిమజ్జనోత్సవాన్ని వీక్షించేందుకు భారీగా తరలివచ్చిన ప్రజలు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవ శోభాయాత్ర శుక్రవారం రాత్రి ప్రారంభమైంది. జిల్లా కేంద్రంలోని ధర్మశాల వద్ద యువజన సమాఖ్య వినాయకుడికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎస్పీ రాజేష్ చంద్రలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కలెక్టర్, ఎస్పీలు జెండా ఊపి శోభాయాత్రను ప్రారంభించారు. నిమజ్జనోత్సవాన్ని తిలకించడానికి పట్టణవాసులతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తజనం భారీ సంఖ్యలో తరలివచ్చారు. దీంతో సుభాష్ రోడ్, జేపీఎన్ రోడ్, సిరిసిల్ల రోడ్, మాయాబజార్, పాంచ్‌రస్తా, పెద్దబజార్, పాత పట్టణంలో జనంతో రద్దీగా మారింది. సుమారు 400లకు పైగా విగ్రహాలను జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠించారు. భారీ విగ్రహాలను ట్రాక్టర్లలో ఎక్కించడానికి మున్సిపల్ నుంచి భారీ క్రేన్‌లను తెప్పించారు. రెండు రోజుల పాటు ఈ శోభాయాత్ర సాగనుంది. టేక్రియాల్‌లో విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. ఇందిరాచౌక్ వద్ద వీహెచ్‌పీ ఆధ్వర్యంలో సభ ఏర్పాటు చేశారు.

శోభాయాత్రకు భారీ భద్రత

జిల్లా కేంద్రంలో రెండు రోజుల పాటు సాగే వినాయక నిమజ్జన శోభాయాత్ర కార్యక్రమం ప్రశాంతంగా నిర్వహించడానికి పోలీసులు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. ఎస్పీ రాజేష్ చంద్ర పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకుంటున్న వినాయకులు

శోభాయాత్రలో భారీ విగ్రహాలతో పాటు వివిధ రూపాల్లో వినాయకులు ఆకట్టుకుంటున్నాయి. వాహనాలను విద్యుత్ దీపాలు, పూలతో అలంకరించారు. నాసిక్ ఢోల్, డప్పులు, డోలు చప్పుల మధ్య వినాయకులను తరలించారు. రెండు రోజుల పాటు ఘనంగా నిమజ్జనోత్సవం సాగుతుంది.



కొబ్బరికాయ కొట్టి శోభాయాత్రను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



పాత బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న వీహెచ్‌పీ ప్రతినిధులు



శోభాయాత్రను వీక్షించడానికి తరలివచ్చిన జనాలు

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి


- 300 మందితో పటిష్ట బందోబస్తు
- 120 సీసీ కెమెరాలతో ప్రత్యేక నిఘా
- ఎస్పీ రాజేష్ చంద్ర



డీపీవో కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ

కామారెడ్డి క్రైం : కామారెడ్డి పట్టణంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర శాంతియుతంగా, సురక్షితంగా జరగడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలో శోభాయాత్ర జరిగే మార్గాన్ని పరిశీలించారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎస్పీ మాట్లాడుతూ.. వినాయక ప్రతిమలు వెళ్లే దారి వెంబడి 300 మంది పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటారని వెల్లడించారు. 120 సీసీ కెమెరాలు, 2 డ్రోన్ కెమెరాల ద్వారా నిఘా ఏర్పాట్లు చేపట్టామని వివరించారు. శోభాయాత్రలో పాల్గొనే భక్తుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పోలీసు అధికారులకు సూచించారు. రూట్ మ్యాప్ ప్రకారం శోభాయాత్ర సాఫీగా కొనసాగేలా చూడాలన్నారు. ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా బారికేడింగ్, ట్రాఫిక్ డైవర్షన్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శాంతి భద్రతలకు భంగం కలిగే ఘటనలకు చోటు లేకుండా సమన్వయంతో, సహనంతో పనిచేయాలని సూచించారు. జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు, నిమజ్జన ఘాట్లు, ట్రాఫిక్ జంక్షన్ల వద్ద అదనపు బందోబస్తు అమలు చేయాలని ఆదేశించారు. అదనపు ఎస్పీ నర్సింహా రెడ్డి, ఏఎస్పీ చైతన్యారెడ్డి, ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

కామారెడ్డి పట్టణంలో వినాయక నిమజ్జనం రూట్‌మ్యాప్



సీఎం పర్యటనతో ఒరిగిందేమీ లేదు

- మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్



సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : వరదలతో అతలాకుతలమైన కామారెడ్డి జిల్లాకు సీఎం వస్తున్నాడంటే ఎంతో మేలు జరుగుతుందని భావించామని, కానీ ఒక్క పైసా మంజూరు చేయకుండా సీఎం పర్యటన ముగియడం విచారకరమని మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ అన్నారు. కామారెడ్డిలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ.. కామారెడ్డి పట్టణంలోని జీఆర్ కాలనీ, హౌసింగ్‌బోర్డు, కౌండిన్య కాలనీ, బతుకమ్మ కుంట, టీచర్స్ కాలనీలతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో వరదలతో సర్వస్వం కోల్పోయి రోడ్డున పడ్డ ప్రజలకు నామమాత్రపు పరిహారం ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆరోపించారు. సీఎం వచ్చినపుడు తక్షణమే నిధులు మంజూరు చేయకుండా, 15 రోజులకు సమీక్షిస్తానని చెప్పడమంటే ప్రజల్ని వంచించడమేనన్నారు. చనిపోయిన కుటుంబాలకు రూ.25 లక్షలు, ఇసుక మేటలు వేసిన పొలాలకు ఎకరాకు రూ.50 వేలు, దెబ్బతిన్న పంటలకు ఎకరాకు కనీసం రూ.25 వేలు ఇచ్చి ఆదుకోవాలన్నారు.

తాత్కాలిక ట్రాఫిక్ డైవర్షన్ అమలు

- ఎస్పీ రాజేష్ చంద్ర

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో గణేష్ శోభాయాత్ర ప్రారంభమైన నేపథ్యంలో ట్రాఫిక్ ఇబ్బందులు కలుగకుండా వాహనాల రాకపోకలకు దారి మళ్లింపు చర్యలు చేపట్టినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలందరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ గణేష్ శోభాయాత్ర విజయవంతంగా, వైభవంగా జరగడానికి సహకరించాలని కోరారు. శుక్రవారం సాయంత్రం 6 గంటల నుంచి జిల్లా కేంద్రలో గణేష్ శోభాయాత్ర కార్యక్రమం ముగిసే వరకు భారీ వాహనాలకు పట్టణంలోకి అనుమతి లేదన్నారు. ఈ ట్రాఫిక్ డైవర్షన్లు శనివారం రాత్రి నిమజ్జనం పూర్తయ్యే వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.

వాహనాలు ఈ మార్గాల్లో వెళ్లాలి..

- కరీంనగర్, సిరిసిల్ల వైపు నుంచి కామారెడ్డికి వచ్చే వాహనాలు జిల్లా కేంద్రానికి సమీపంలోని బైపాస్ నుంచి ఎన్‌హెచ్-44 రోడ్డు మీదగుండా టేక్రియాల్ బైపాస్ ద్వారా పట్టణంలోనికి రావాల్సి ఉంటుంది. సిరిసిల్ల, కరీంనగర్ వెళ్లే వాహనాలకు సైతం ఇదే దారి వర్తిస్తుంది.
- కామారెడ్డి కొత్త బస్టాండ్ నుంచి పాత బస్టాండ్ వైపు వెళ్లే వాహనాలు అశోక్ నగర్, రైల్వే గేట్ గుండా ఒక మార్గంలో కలెక్టర్ ఆఫీస్ ముందు నుంచి గుమాస్తా కాలనీ మీదుగా రామారెడ్డి వైపు వెళ్లవచ్చు. మరో మార్గంలో ఓం శాంతి భవనం నుంచి రాజీవ్‌నగర్, టీచర్స్ కాలనీ, ఇందిరానగర్‌ల మీదుగా పాత పట్టణం వైపు వెళ్లొచ్చు.
- హైదరాబాద్, రాజంపేట వైపుల నుంచి వచ్చే వాహనాలు టేక్రియాల్ బైపాస్ మీదుగా ఇందిరాగాంధీ స్టేడియం ముందు నుంచి కొత్త బస్టాండ్ చేరుకొని పట్టణంలోకి ప్రవేశించాల్సి ఉంటుంది.
- హైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలు యథావిధిగా వెళ్లొచ్చు.

తీరని యూరియా కష్టాలు

- వరుసలో ఉన్నా దొరకని పరిస్థితి
- సొసైటీల వద్ద జాగారం చేస్తున్న రైతులు
- ఎవరికీ పట్టని రైతుల గోడు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: అవసరమైన సమయంలో యూరియా కొరత రైతుల్ని ఆందోళనకు గురిచేస్తోంది. ఎరువుల కోసం బారులు తీరుతున్న రైతులు సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల ముందు రోజు రాత్రి నుంచే సొసైటీల వద్దకు చేరుకుని అక్కడే జాగారం చేస్తున్నారు. ఎక్కడ చూసినా పెద్ద పెద్ద లైన్లు కనపడుతున్నాయి. ముందుగా వచ్చి వరుసలో నిల్చున్న వారికి ఎరువుల బస్తాలు దొరుకుతుండగా, వెనకాల ఉన్న వారు ఆఖరుకు స్టాక్ అయిపోయిందనడంతో నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది. శుక్రవారం ఎల్లారెడ్డిలో యూరియా కోసం రైతులు పొద్దున్నుంచే వరుస కట్టారు. పాసుపుస్తకాలను వరుసలో పెట్టారు. బుధవారం మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో, అలాగే రాజంపేట మండలం తలమడ్లలో యూరియా కోసం రైతులు వరుసకట్టారు. రామారెడ్డిలో అయితే రాత్రి రైతు వేదిక వద్ద జాగారం చేశారు. వారం రోజులుగా రాజంపేట, మాచారెడ్డి, తాడ్వాయి, భిక్కనూరు, దోమకొండ, బీబీపేట తదితర మండలాల్లో రైతులు యూరియా కోసం తిప్పలు పడుతున్నారు. జిల్లాలో 5.09 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. వరి, మక్క, సోయా, పత్తి పంటలు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేశారు. అయితే మక్కకు యూరియా అధిక మోతాదులో వాడుతున్నారు. దీంతో యూరియా అవసరం పెరిగింది. అవసరానికి తగ్గట్టుగా యూరియా సరఫరా కాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి.. యూరియా సరఫరా విషయంలో అధికారుల మధ్యన సమన్వయం అవసరమని పేర్కొన్నారు. గ్రామాల వారీగా యూరియాను సరఫరా చేయడానికి ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.



ఎల్లారెడ్డిలో యూరియా కోసం పాసు పుస్తకాలను క్యూలో ఉంచి వేచి చూస్తున్న రైతులు

క్యూ లైన్‌లో మహిళలు

మాచారెడ్డి : ఎల్లంపేటలో శుక్రవారం యూరియా కోసం మహిళలు బారులు తీరారు. ఎల్లంపేటకు కేవలం 5 వందల బస్తాల యూరియా మాత్రమే వచ్చింది. దీంతో ముందు వరుసలో ఉన్న వారికి మాత్రమే ఒక్కొక్కరికి ఒక్కో బస్తా ఎరువు దొరికింది. ఉదయం నుంచే యూరియా కోసం వరుసలో నిలబడిన మహిళలకు యూరియా లభించకపోవడంతో శాపనార్థాలు పెడుతూ వెనుదిరిగారు. స్టాక్ అయిపోయిందంటూ అధికారులు చేతులు దులుపుకున్నారు.



మాచారెడ్డి మండలం ఎల్లంపేటలో యూరియా కోసం బారులు తీరిన మహిళా రైతులు

హాజరు మెరుగు కోసమే ‘ఎఫ్‌ఆర్‌ఎస్’

- జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో యాప్ ద్వారా విద్యార్థుల హాజరు నమోదు
- హాజరును యాప్ ద్వారా పర్యవేక్షిస్తున్న రాష్ట్ర ఇంటర్ బోర్డు అధికారులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి) : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని మెరుగుపర్చేందుకు అధికారులు ఎఫ్‌ఆర్‌ఎస్(ఫేస్ రికగ్నిషన్ సిస్టం)ను అమలు చేస్తున్నారు. గతంలో కళాశాలల్లో విద్యార్థుల హాజరును రిజిస్టర్‌లో నమోదు చేసేవారు. ప్రస్తుతం ప్రత్యేకమైన యాప్ ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా నమోదు చేస్తున్నారు. కొంతకాలంగా ఇంటర్ పరీక్షల్లో చాలామంది విద్యార్థులు ఫెయిలవుతున్నారు. తరగతులకు సక్రమంగా హాజరు కాకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని గ్రహించిన ఉన్నతాధికారులు ప్రతి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు హాజరు నమోదుకు ఎఫ్‌ఆర్‌ఎస్‌ను ప్రవేశపెట్టారు. ఈ క్రమంలో జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల హాజరును గత నెల 26 నుంచి ఎఫ్‌ఆర్‌ఎస్‌లో నమోదు చేస్తున్నారు.

భారీ వర్షాలతో ఆటంకం..

ఇటీవల జిల్లాలో కురిసిన భారీవర్షాలతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎఫ్‌ఆర్‌ఎస్‌లో హాజరు నమోదు ప్రక్రియకు కొంత ఆటంకం కలిగింది. జిల్లాలోని 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు 6 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా చాలామంది విద్యార్థులు కళాశాలలకు రాలేకపోతున్నారు. దీనివల్ల విద్యార్థులందరి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాలేదు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన అనంతరం ఎఫ్‌ఆర్‌ఎస్ ప్రక్రియ పకడ్బందీగా అమలు కానుంది. నూతన హాజరు విధానం అమలులో భాగంగా కళాశాలల్లో ప్రతిరోజూ ఉదయం విద్యార్థుల ఫొటోలను ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేసి హాజరును నమోదు చేస్తున్నారు. ఈ హాజరును రాష్ట్ర ఇంటర్‌బోర్డు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఎవరైనా విద్యార్థులు వరుసగా వారం రోజులపాటు కళాశాలకు గైర్హాజరయితే రాష్ట్ర ఇంటర్‌బోర్డు అధికారులు జిల్లా ఇంటర్ అధికారుల ద్వారా సంబంధిత కళాశాల అధ్యాపకులను అప్రమత్తం చేస్తారు.



నాగిరెడ్డిపేట జూనియర్ కళాశాలలో ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా హాజరును నమోదు చేస్తున్న ఉపాధ్యాయుడు

“ప్రస్తుతం విద్యార్థులకే...

ప్రస్తుతం జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని విద్యార్థుల హాజరును మాత్రమే పర్యవేక్షించడానికి ఎఫ్‌ఆర్‌ఎస్‌ను అమలు చేస్తున్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలోని ఎయిడెడ్, ప్రయివేట్ కళాశాలలకు సైతం ఈ విధానాన్ని విస్తరింపజేయనున్నారు. దీంతోపాటు రాబోయే రోజుల్లో కళాశాలల్లోని అధ్యాపకుల హాజరును పర్యవేక్షించడానికి కూడా ఎఫ్‌ఆర్‌ఎస్‌ను అమలు చేయనున్నారు.

– షేక్ సలాం, జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి, కామారెడ్డి

ఉత్తమ సేవలు అందించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం: జిల్లాలోని ఆయా గ్రామాలకు ఎంపికైన గ్రామ పాలనాధికారులు శనివారం హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను పొందనున్నారు. అందుకు గాను గ్రామపాలనాధికారులను హైదరాబాద్ తీసుకువెళ్లేందుకు రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 7 ప్రత్యేక బస్సులను కలెక్టరేట్ వద్ద కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జెండా ఊపి ప్రారంభించారు. ఇదివరకు కామారెడ్డి రెవెన్యూ శాఖలో వీఆర్వోలు, వీఆర్ఏలుగా పనిచేసి ప్రస్తుతం ఇతర శాఖల్లో విధులు నిర్వహిస్తున్న వారికి ఇటీవల ప్రభుత్వం ఎంపిక పరీక్ష నిర్వహించింది. ఎంపికైన 365 మంది నియామక ఉత్తర్వులు పొందనున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ శాఖలలో పనిచేస్తూ తిరిగి రెవెన్యూ శాఖలోకి వస్తున్న వారిని అభినందించారు. ఉత్తమ సేవలు అందించి గుర్తింపు పొందాలని సూచించారు. ఈ బస్సులలో ఎల్లారెడ్డి ఆర్డీవో పార్థ సింహా రెడ్డి, కలెక్టరేట్ ఏవో మసూద్ అహ్మద్, సిబ్బంది తరలి వెళ్లారు.

గ్యాస్ ట్యాంకర్‌ను ఢీకొన్న బస్సు



భిక్కనూరు: జంగంపల్లి శివారులో జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, గ్యాస్ ట్యాంకర్‌ను ఢీకొట్టింది. వివరాలు.. నిజామాబాద్ డిపో-1కు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం సికింద్రాబాద్ నుంచి నిజామాబాద్ వైపు వస్తోంది. జంగంపల్లి శివారులోకి రాగానే ముందున్న గ్యాస్ ట్యాంకర్‌ను వేగంగా వచ్చి ఢీకొట్టి అనంతరం అదుపుతప్పి రోడ్డు అవతలి వైపునకు దూసుకెళ్లింది.ఈ ఘటనలో బస్సు ముందర భాగం, ప్రవేశ ద్వారం తీవ్రంగా దెబ్బతిన్నాయి. దీంతో ప్రయాణికులు అత్యవసర ద్వారం గుండా బయటకు వచ్చారు. ఈ ప్రమాదంలో గ్యాస్ ట్యాంకర్ నుంచి గ్యాస్ లీకేజీ కాకపోవడంతోపాటు పేలకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. ఒకవేళ ట్యాంకర్ పేలి ఉంటే భారీ ప్రమాదం జరిగేదని స్థానికులు పేర్కొన్నారు.

క్లుప్తంగా

బ్యాగులు, పుస్తకాల అందజేత



రాజంపేట : మండలంలోని లేత మామిడి తండా, నడిమి తండా, ఎల్లాపూర్ తండాల విద్యార్థులకు క్లైమేట్ ఫ్రంట్ హైదరాబాద్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం స్కూల్ బ్యాగ్స్, పుస్తకాలు అందజేశారు. మండలానికి చెందిన సీఆర్‌పీ సూర్య పాల్ ప్రత్యేక చొరవతో స్వచ్ఛంద సంస్థ సహకారంతో 90 మంది విద్యార్థులకు ఈసామగ్రిని అందించారు. ఈ సందర్భంగా సంస్థకు చెందిన అరణ్య మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో క్లైమేట్ ఫ్రంట్ హైదరాబాద్ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయులు, తండా పెద్దలు పాల్గొన్నారు.

రక్తదాతల సమూహం ఉపాధ్యాయులకు సన్మానం



కామారెడ్డి అర్బన్: సామాజిక సేవగా కామారెడ్డి రక్తదాతల సమూహం ద్వారా వేలాది మంది అత్యవసర రోగులకు రక్తం అందించడంలో కృషి చేయడంతో పాటు ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న ప్రతినిధులను ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. శుక్రవారం స్థానిక కల్కి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.బాలు, వేదప్రకాష్, జమీల్ హైమద్, పర్స వెంకటరమణ, జలిగామ శ్రీకాంత్‌లను సన్మానించారు. ఆర్యవైశ్య మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు గంప ప్రసాద్, ఐవీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎర్రం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలి

- టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి



కామారెడ్డి టౌన్: జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించడంలో ఉద్యోగుల కృషి అభినందనీయమని టీఎస్ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కే. వరుణ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డివిజనల్ కార్యాలయంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలకు, రైతులకు ఇబ్బందులు రాకుండా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలని ఆదేశించారు. సంస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టిన వరద సహాయక చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విధుల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఈ సమావేశంలో సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ శ్రవణ్‌కుమార్, డీఈలు, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



నర్వలో దాండియా ఆడుతున్న మహిళలు



గాంధారి వీధుల్లో నిర్వహిస్తున్న శోభాయాత్ర



సాతోలిలో గణేశ్ నిమజ్జనం చేస్తున్న యువకులు

గంగమ్మ ఒడిలోకి తరలుతున్న గణనాథులు



కామారెడ్డిలో తరలుతున్న వినాయకులు





నస్రుల్లాబాద్ లో యువభారత్ యూత్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న యువకులు, కుప్రియాల్‌లో యువ యూత్ గణేశ్ మండలి సభ్యులు

సాక్షి నెట్‌వర్క్ : గణపయ్యలను గంగమ్మ చెంతకు భక్తులు తరలిస్తున్నారు. గణపయ్యలకు తొమ్మిది రోజుల పాటు భక్తి శ్రద్ధలతో నిత్య పూజలు నిర్వహించిన భక్తులు శుక్రవారం కామారెడ్డి జిల్లాలోని పలు చోట్ల గణనాథులకు ఘనంగా వీడ్కోలు పలికారు. యువత పాటలు, వాయిద్యాలు, నృత్యాలతో శోభాయాత్ర నిర్వహించారు.



తాడ్వాయిలోని కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిలో తరలుతున్న గణనాథులు



శోభాయాత్రను తిలకించేందుకు డ్రోన్‌ను ఆపరేట్ చేస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర, పక్కన కలెక్టర్, ఏఎస్పీ



తాడ్వాయి: ఎడ్ల బండిలో తరలుతున్న గణేశుడు



బీబీపేటలో గణనాథుడిని తరలిస్తున్న గ్రామస్తులు



జక్షిజాన్కంపల్లిలో ఉట్టి కొడుతున్న భక్తులు



దేవునిపల్లిలో వినాయక నిమజ్జనంలో పుష్ప-2 వేషధారణతో అలరించిన యువకుడు



టేక్రియాల్ చెరువు వద్ద గణనాథుడితో భక్తులు



బీబీపేటలో నిమజనం చేస్తున్న భక్తులు



భిక్కనూరులో నిమజ్జనానికి తరలి వెళ్తున్న యువజన సంఘం గణనాథుడు



కామారెడ్డి తూర్పు హౌసింగ్‌బోర్డు కాలనీలో నిమజ్జనం కోసం విగ్రహాలను తీసుకెళ్తున్న మహిళలు



లింగంపేటలో పూజలు చేస్తున్న భక్తులు

జోరుగా లడ్డూ వేలంపాటలు



ఘన్‌పూర్(ఎం) గ్రామంలో వినాయక లడ్డూను దక్కించుకున్న దయాకర్‌రావ్



గోపాల్‌పేటలో లడ్డూను దక్కించుకున్న సురేశ్

మాచారెడ్డి/ఎల్లారెడ్డిరూరల్/నాగిరెడ్డిపేట/దోమకొండ : జిల్లాలో గణేశ్ మండపాల వద్ద లడ్డూ వేలం పాటలు శుక్రవారం జోరుగా సాగాయి. మాచారెడ్డి మండలం ఘన్‌పూర్(ఎం) గ్రామంలో హిందూ వాహినీ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి సంబంధించిన లడ్డూను వేలంపాటలో గ్రామానికి చెందిన ఏనుగు దయాకర్‌రావ్, ఉదయ్‌లు రూ.28 వేలకు దక్కించుకున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని దేవునిపల్లి గణేష్ మండలి వద్ద ఎల్లారెడ్డికి చెందిన సంగయ్య రూ.35 వేలకు లడ్డూను వేలంలో దక్కించుకోగా, సాతోలి గ్రామంలో నిర్వహించిన వేలంలో లడ్డూను కిషోర్ రూ. 11 వేలకు దక్కించుకున్నారు. నాగిరెడ్డిపేట మండలం గోపాల్‌పేటలో శ్రీ సాయినాథ్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహానికి సంబంధించిన లడ్డూ వేలం పాటలో గోపాల్‌పేటకు చెందిన పీకే. సురేశ్ రూ.72వేలకు లడ్డూను దక్కించుకున్నాడు.దోమకొండ మండలం సంఘమేశ్వర్ గ్రామంలో కుర్మ యువజన సంఘం వినాయకుడి లడ్డూ వేలం పాట నిర్వహించగా, గ్రామానికి చెందిన బోడపట్ల మల్లేశ్ రూ.40,500లకు దక్కించుకున్నారు. నిర్వాహకులు లడ్డూలను దక్కించుకున్నవారికి అందజేశారు.



సంఘమేశ్వర్‌లో లడ్డూను దక్కించుకున్న బోడపట్ల మల్లేశ్

అవార్డులు అందుకున్న ఉత్తమ గురువులు

రాజంపేట/కామారెడ్డి అర్బన్: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో శుక్రవారం రాష్ట్రస్థాయి ఉత్తమ టీచర్లుగా ఎంపికై న వారికి అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. హైదరాబాద్‌లోని శిల్ప కళావేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ యోగితారాణా, ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి చేతుల మీదుగా పలువురు అవార్డులను అందుకున్నారు. రాజంపేట మండలం పొందూర్తి ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ముదాం స్వామి రాష్ట్ర ఉత్తమ టీచర్‌గా ఎంపిక కావడంతో ఆయనకు అవార్డును అందజేశారు. అలాగే కామారెడ్డి డెయిరీ టెక్నాలజీ కళాశాల అసోసియేట్ డీన్ సురేష్ రాథోడ్ సైతం రాష్ట్ర ఉత్తమ టీచర్‌గా ఎంపిక కావడంతో అవార్డును అందుకున్నారు.



అవార్డు అందుకుంటున్న డెయిరీ డీన్ సురేష్‌రాథోడ్



అవార్డు అందుకుంటున్న పొందూర్తి యూపీఎస్ టీచర్ ముదాం స్వామి

లింబాద్రి నర్సింహస్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి

మోర్తాడ్: భీమ్‌గల్ మండలంలోని లింబాద్రి గుట్ట శ్రీలక్ష్మి నర్సింహస్వామి ఆలయాన్ని శుక్రవారం హైకోర్టు న్యాయమూర్తి ప్రవీణ్‌రావు కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్తలు నంబి పార్థసారథి, వాసు పంతులు వారికి ఘన స్వాగతం పలికారు. సంప్రదాయబద్ధంగా ప్రత్యేక పూజలను నిర్వహించి స్వామివారి తీర్థ ప్రసాదాలను ప్రవీణ్ రావుకు, ఆయన కుటుంబసభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్సై సుభాష్ బందోబస్తును నిర్వహించారు.



ప్రతిభావంతులకు ప్రోత్సాహకం

- దీన్‌దయాళ్ స్పర్శ్ యోజనకు దరఖాస్తులు
- ఈనెల 13 వరకు చివరి తేదీ



సదాశివనగర్(ఎల్లారెడ్డి): కేంద్ర ప్రభుత్వ కమ్యూనికేషన్‌ల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి ఉపకార వేతనాలు అందజేయనున్నారు. అన్ని యాజమాన్యాల పరిధిలో ఉన్న ఉన్నత పాఠశాలల్లో ప్రస్తుతం 6-9 తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పథకం కింద లబ్ధి పొందేందుకు అర్హులు. విద్యార్థుల్లో పోస్టల్ బిళ్లల సేకరణ(ఫిలాటలీ) అభిరుచిని పెంపొందించేందుకు ఈ కార్యక్రమాన్ని రూపొందించారు. చదువులో ప్రతిభను చాటడంతో పాటు ఫిలాటలీని అభిరుచిగా కొనసాగిస్తున్న విద్యార్థులకు అర్హత పరీక్ష నిర్వహించి అందులో ప్రతిభను చాటిన వారికి ఉపకార వేతనాలు అందజేయనున్నారు.

వీరే అర్హులు...

దీన్ దయాళ్ స్పర్శ్ యోజన ఉపకార వేతనాలు పొందడానికి 2024-25 విద్యా సంవత్సరంలో విద్యార్థులు చదివిన తరగతుల్లో వార్షిక పరీక్షల్లో ఎస్సీ,ఎస్టీలు 55శాతం, బీసీ, ఓసీలు 60 శాతం మార్కులు సాధించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. తపాలా బిళ్లల సేకరణ, అధ్యయనంతో కలిగే ఉపయోగాలపై పోటీలు నిర్వహించనున్నారు. అర్హులైన విద్యార్థులు ఈ నెల 13లోగా దరఖాస్తులు పూర్తి చేసి సమీపంలోని పోస్టాఫీసుల్లో అందజేయాలి. విద్యార్థులు పోస్టల్ కార్యాలయాల నుంచి దీన దయాళ్ స్పర్శ్ యోజన క్విజ్ పోటీల దరఖాస్తు పత్రాలను పొందొచ్చు. విద్యార్థులు చదువుతున్న పాఠశాల హెచ్‌ఎం నుంచి స్టడీ సర్టిఫికెట్ తీసుకొని పోస్టాఫీస్ కార్యాలయానికి వెళ్లి రూ.200 చెల్లించి ఫిలాటలీ డిపాజిట్(పీడీ) ఖాతాను తీసుకోవాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ పరీక్షను రెండు విడతల్లో నిర్వహించనున్నారు. ప్రతి రాష్ట్రంలో ఒక్కో తరగతి నుంచి పది మంది చొప్పున 40 మందిని ఎంపిక చేస్తారు. మొదటి విడతలో జనరల్ నాలెడ్జ్‌కు 5, చరిత్రకు 5, జాగ్రఫీకి 5, సైన్స్‌లో 5, క్రీడలు, సంస్కృతి, పర్సనాలిటీ అంశాలకు 5, లోకల్ ఫిలాటలీకి 10, నేషనల్ ఫిలాటలీకి 15 చొప్పున 50 మార్కులు కేటాయించారు. ఇందులో ఎంపికైన విద్యార్థులను రెండో విడతకు ఎంపిక చేస్తారు. రెండో విడతలో విద్యార్థులు ప్రాజెక్టును తయారు చేయాలి. పోస్టల్ శాఖ ఇచ్చే అంశాలపై ఉత్తమ ప్రాజెక్టును రూపొందించిన విద్యార్థులను ఉపకార వేతనాలకు ఎంపిక చేస్తారు.

ఎస్సారెస్పీ వరద గేట్ల మూసివేత

- ఇన్‌ఫ్లో తగ్గుముఖం
- గోదావరిలోకి నీటి విడుదల నిలిపివేత



బాల్కొండ: ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు తగ్గుముఖం పట్టడంతో శ్రీరాంసాగర్ జలాశయం వరద గేట్ల ద్వారా నీటి విడుదలను అధికారులు శుక్రవారం నిలిపివేశారు. ప్రాజెక్ట్‌లోకి ప్రస్తుతం 50 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. ఈ సంవత్సరం ఇప్పటి వరకు 355 టీఎంసీల నీరు వచ్చింది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు 4500, ఎస్కేప్ గేట్ల ద్వారా 3500, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. 666 క్యూసెక్కుల నీరు ఆవిరి రూపంలో పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా 1090.10(77.23 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

దిగువకు 240 టీఎంసీలు

గత నెలలో ఎగువ ప్రాంతాల నుంచి భారీ వరదలు రావడంతో ప్రాజెక్టు వరద గేట్ల ద్వారా గోదావరిలోకి నీటి విడుదలను ప్రారంభించారు. మధ్యలో రెండ్రోజులు మాత్రమే నిలిపి వేశారు. తరువాత మళ్లీ వరద పోటెత్తడంతో గత నెల 27 నుంచి ఈనెల 4 వరకు నిరంతరం నీటి విడుదల చేపట్టారు. గరిష్టంగా 5.75 లక్షల క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రాజెక్ట్ నుంచి 240 టీఎంసీల నీటిని గోదావరిలోకి వదిలారు.

నేడు నిజామాబాద్‌కు పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ రాక

నిజామాబాద్ సిటీ : పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్‌గౌడ్ శనివారం నిజామాబాద్ జిల్లాకు రానున్నారు. వినాయక నిమజ్జనం సందర్భంగా మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా కేంద్రంలోని దుబ్బలో సార్వజనిక్ వినాయకుడికి ప్రత్యేక పూజలు చేసి శోభాయాత్రను ప్రారంభిస్తారని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశవేణు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

నిందితులను వెంటనే పట్టుకోవాలి



బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రాహింపేట్ గ్రామంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే పట్టుకోవాలని బాన్సువాడ డివిజన్ అంబేద్కర్ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శుక్రవారం సీఐ అశోక్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దుండగులను వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. నాయకులు బంగారు మైసయ్య, ప్రశాంత్, మల్లార్ సాయిలు,మన్నెచిన్న సాయిలు, సాయిలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

రాజంపేట: ఆత్మహత్యకు యత్నించిన ఓ వివాహిత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. వివరాలు ఇలా.. రాజంపేట మండలం గుడితండాకు చెందిన ధారావత్ స్రవంతి-సురేష్ దంపతుల మధ్య కొంతకాలంగా కుటుంబ కలహాలు ఉన్నాయి. ఈక్రమంలో మంగళవారం ఉదయం సురేష్ తన భార్య స్రవంతి(21)ని మందలించడంతో ఆమె క్షణికావేశంలో గడ్డి మందు తాగింది. దీంతో సురేష్ స్థానికుల సహాయంతో ఆమెను చికిత్స నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలించారు. గురువారం మధ్యాహ్నం అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. మృతురాలి తండ్రి లాల్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

క్రైం కార్నర్

హత్య కేసులో నిందితుల రిమాండ్

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని మామిడిపల్లిలో ఇటీవల జరిగిన వృద్ధుడి హత్యకేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ శుక్రవారం తెలిపారు. కామారెడ్డికి చెందిన అంగర లక్ష్మీ, భర్త వేణుకుమార్‌తో కలిసి మామిడిపల్లిలో నివాసం ఉంటున్నారు. కాగా మోర్తాడ్ మండలం సుంకేట్ గ్రామానికి చెందిన పోతు నరేందర్ (65) మామిడిపల్లిలోని వీరి నివాసానికి తరచూ వస్తుండేవాడు. గత నెల 20న నరేంధర్ వారి ఇంటికి వెళ్లగా, లక్ష్మీ, ఆమె భర్త వేణుకుమార్, అల్లుడు రాజశేఖర్, కొడుకు నవీన్, కుమార్తె నవ్య కలిసి హత్యచేశారు. నరేంధర్‌పై ఉన్న బంగారు గొలుసు, రెండు ఉంగరాలను కాజేశారు. మృతదేహాన్ని గోనెసంచిలో కుక్కి ఎవరికి అనుమానం రాకుండా మామిడిపల్లి వద్ద నిజాంసాగర్ కెనాల్‌లో వదిలేశారు. మోర్తాడ్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులకు నిందితులైన లక్ష్మీ, అల్లుడు రాజశేఖర్, కుమారుడు నవీన్ పట్టుబడ్డారు. కాగ వేణుకుమార్, నవ్య పరారీలో ఉన్నారని, వారికోసం గాలింపు చేపట్టామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

కలుషిత ఐస్‌క్రీమ్ విక్రయంపై కేసు నమోదు

నవీపేట: మండలంలోని ధర్యాపూర్ తండాలో కలుషిత ఐస్‌క్రీమ్ విక్రయించిన ఎడపల్లికి చెందిన చాంద్‌పాషాపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి శుక్రవారం తెలిపారు. గురువారం సాయంత్రం చీమలు, బూజు పట్టిన ఐస్‌క్రీములను చిన్నారులకు విక్రయించడంతో వారు స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. దీంతో తండాకు చెందిన అంబర్‌సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా చాంద్‌పాషాపై కేసు నమోదు చేశామన్నారు.

చెట్టును ఢీకొన్న ఆటో : ఒకరి మృతి

మోర్తాడ్(బాల్కొండ): ఓ ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఒకరు మృతిచెందారు. ఎస్సై రాజేశ్వర్ తెలిపిన వివరాలు ఇలా.. నిర్మల్‌కు చెందిన పోగుల సత్యనారాయణ (48) గురువారం రాత్రి ఓ పని నిమిత్తం సమీప బంధువుతో కలిసి ఆటో నడుపుకుంటూ ఏర్గట్ల గ్రామానికి వచ్చాడు. పని ముగిసిన అనంతరం అర్ధరాత్రి తిరిగి అతడు ఆటో నడుపుతూ నిర్మల్‌కు బయలుదేరాడు. ఏర్గట్ల పోలీసు స్టేషన్ పరిధిలోని బట్టాపూర్-తొర్తిల మధ్య ఉన్న రోడ్డుపై అతడి ఆటో అదుపుతప్పి పక్కన ఉన్న చెట్టును ఢీకొట్టింది. ఈఘటనలో ఆటో నడుపుతున్న సత్యనారాయణకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాక్లూర్ మండలంలో వృద్ధురాలు..

మాక్లూర్: ఆత్మహత్యకు యత్నించిన ఓ వృద్ధురాలు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని డీకంపల్లి గ్రామానికి చెందిన జీలకర్ర ముత్తెమ్మ (69) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. దీంతో ఆమె జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు ఆమెను గమనించి చికిత్స నిమిత్తం జిల్లాకేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు పోశెట్టి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

వాడి గ్రామస్తుల ధర్నా



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై కళ్యాణి

ధర్పల్లి: ముత్యాల చెరువుతో మా గ్రామానికి ముంపు ఉన్నదని, ఆ చెరువు వద్ద మళ్లీ మరమ్మతులు చేపట్టి చెరువు కట్టను నిర్మించవద్దని వాడి గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. తెగిపోయిన ముత్యాల చెరువు వద్ద ఇరిగేషన్ అధికారులు చెరువు కట్ట తెగిపోవడానికి గల కారణాలను పరిశీలించడానికి అధికారులు శుక్రవారం వచ్చారు. విషయం తెలుసుకున్న వాడి గ్రామస్తులు ఇరిగేషన్ అధికారులతో మాట్లాడడానికి ట్రాక్టర్లపై ముత్యాల చెరువు వద్దకు వెళ్లారు. ధర్పల్లి ఎస్సై కళ్యాణి సిబ్బందితో కలిసి గ్రామస్తులను అడ్డుకొని వారిని నివారించారు. దీంతో వాడి రోడ్డుపై కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. ఆగ్రహించిన గ్రామస్తులు రెండు గంటలపాటు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. చెరువు తెగి భారీ వరద గ్రామంలోకి రావడంతో ఇళ్లు, పంట భూములు కోల్పోయి ప్రాణాలతో బయటపడ్డామని గ్రామస్తులు వాపోయారు.

విద్యుత్ షాక్‌తో బాలుడికి గాయాలు

వర్ని: మండలంలోని పాత వర్ని గ్రామంలో ఓ బాలుడికి విద్యుత్ షాక్ తగిలి తీవ్ర గాయాలు అయ్యాయి. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. పాత వర్ని గ్రామానికి చెందిన గడ్డం నరేష్ (7) శుక్రవారం గ్రామంలోని వీరభద్ర ఆలయం నుంచి ఇంటికి బయలుదేరాడు. ఈక్రమంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి సపోర్టుగా ఉన్న తీగను పట్టుకోవడంతో అతడికి కరెంట్ షాక్ తగిలింది. వెంటనే స్థానికులు గమనించి కర్రతో బాలుడిని కొట్టడంతో కింద పడిపోయాడు. అనంతరం బాలుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. స్తంభానికి మినీ ట్రాన్స్‌ఫార్మర్ ఉండడంతోనే సపోర్ట్ వైర్‌కు విద్యుత్ సరఫరా అయినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యుత్‌శాఖ అధికారులు వెంటనే స్పందించి స్తంభానికి ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.